# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు.
- ❖ భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- ❖ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు.
- ❖ నిత్యం యోగా సాధన చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు సూచించారు.

==========================

రాష్ట్రంలో అడవులను 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని, ఈ సంవత్సరంలో 5 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి పరిధి అనంతవరం ఎడిసిఎల్ పార్క్ లో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమాన్ని ఈరోజు ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, మంత్రి పి.నారాయణతో కలిసి చంద్రబాబు నాయుడు మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, పర్యావరణ పరిరక్షణలో ప్రధానమైన అంశమని, వచ్చే సంవత్సరం జూన్ నాటికి రాష్ట్రాన్ని సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ రహితంగా మార్చే దిశగా పని చేస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

మానవ మనుగడ వృక్షాలతోనే ముడిపడి ఉందని ఉపముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కె.పవన్ కళ్యాణ్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని పిలుపునిచ్చారు. అడవులలో కార్చిచ్చుల నివారణ, పర్యావరణ పరిరక్షణ కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. మానవ జీవితంలో ప్రకృతికి ఎంతో ప్రాధాన్యం ఉందని, నగర వనాలు, అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్రం ఆదర్శంగా నిలవాలని ఉపముఖ్యమంత్రి ఆకాంక్షిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========================

నిత్యం యోగా సాధనకు అరగంట సమయం కేటాయించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అన్నారు. నరసరావుపేట కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.... యోగా అనేది ఒక నెల రోజుల కార్యక్రమంగా భావించకుండా ప్రతి ఒక్కరూ నిత్యం యోగా సాధన చేయాలని చెప్పారు. శాసనసభ్యులు చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ... దైనందిన జీవితంలో యోగా భాగం కావాలన్నారు.

యోగా వల్ల ఆరోగ్యం బాగుంటుందని.. ప్రతి ఒక్కరూ విధిగా రోజు యోగ సాధన చేసినట్లయితే రోగాలు బారిన పడకుండా ఆరోగ్యాంగా జీవిస్తారని అనకాపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.బాలాజీ అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా ఈ రోజు అనకాపల్లి పట్టణం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో వివిద శాఖల సిబ్బందితో యోగాంధ్ర ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు.

యోగాంధ్ర కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పర్యాటక ప్రదేశాల్లో నిర్వహించే యోగ కార్యక్రమాన్ని ఈరోజు సీతంపేటలోని ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో నిర్వహించారు.

విరామం

==========================

భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈరోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లా పాత్రునివలస గ్రామంలో ఏర్పాటు చేసిన ర్యాలీని కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... జిల్లాలో ఒక్కరోజులో 6 లక్షల మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. మానవాళి మనుగడకు జీవనాధారం పర్యావరణం అని, మన భావితరాలకు ప్రాణవాయువు లభించాలంటే ప్రతి ఒక్కరూ తమ పరిసరాలలో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ఆయన తిలకించారు.

==========================

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈరోజు సీతంపేటలో “నషా ముక్త్ భారత్ అభియాన్” కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగ నివారణపై అవగాహనకు వాక్ థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దృక్పథంతో యువత, మహిళలు, విద్యా సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో భారీ స్థాయిలో అవగాహన కల్పించామన్నారు. వీటికి అలవాటు పడితే ఆరోగ్యం దెబ్బతింటుందని, కుటుంబ పరంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదురయ్యే సమస్యలను వివరించారు.

==========================

అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. గోవిందరావు తెలిపారు. ఈ మేళాలో 20 కంపెనీలు పాల్గొంటాయని.... 10వ తరగతి, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదివి 18 నుంచి 35 సంవత్సరాల లోపు ఉన్న యువతీ యువకులు అర్హులని చెప్పారు. అభ్యర్థులు నైపుణ్యం యాప్ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని, విద్యార్హత తెలిపే ధ్రువపత్రాలతో ఉద్యోగ మేళాకు హాజరు కావాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ వివరాలను వెబ్ సైట్ naipunyam.ap.gov.inలో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 81063 27482 నంబరుకు సంప్రదించాలన్నారు.

==========================

విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధికి 850 కోట్ల రూపాయలను మంజూరు చేయడానికి నీతి ఆయోగ్ ఆమోదం తెలపడం పట్ల స్థానిక పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈరోజు విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలో 4వ డివిజన్ లో సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలోని 70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే గద్దె రామ మోహన్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శివనాథ్ మాట్లాడుతూ... రానున్న 3 సంవత్సరాల కాలంలో విజయవాడ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేస్తామని, వచ్చే నెలలోనే దీనికి సంబంధించిన టెండర్లను పిలుస్తున్నామని తెలియజేశారు.

===========================

ఆపరేషన్ సింధూర్ నిర్వహించడానికి గల కారణాలపై నాలుగు దేశాల్లో అఖిలపక్షాలతో కూడిన తమ ప్రతినిధి బృందం పర్యటించి వివరించిందని నరస్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు అన్నారు. పార్లమెంట్ సభ్యురాలు సుప్రియ సూలే నేతృత్వంలో ఈజిప్ట్, కతార్, ఇథియోపియా, సౌతాఫ్రికా దేశాలను పర్యటించి భారత్ చేరుకున్న ఆయన ఈరోజు న్యూఢిల్లీలో పాత్రికేయులతో మాట్లాడారు. తాము పర్యటించిన దేశాల నుంచి భారతదేశానికి మద్దతు, స్పందన లభించిందని చెప్పారు. ప్రపంచ దేశాలు సానుకూలంగా స్పందించాయని, ఉగ్రవాదాన్ని నిరోధించడానికి కలిసికట్టుగా సాగదానికి ఆయా దేశాల నాయకత్వం నుండి సంఘీభావం లభిస్తోందని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే ఉగ్ర దాడులకు మూలాలు పాకిస్తాన్లో లభిస్తాయని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయని ఈ పర్యటనలో తమకు అర్థమైందని అన్నారు.

===========================

జిల్లాలో నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలకు మార్గం చూపుతున్నామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈరోజు సీతంపేటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న నాలుగు నియోజకవర్గాలలో "స్కిల్ హబ్"లను ఏర్పాటు చేశామన్నారు. సీతంపేటలో శిక్షణ పొందుతున్న అభ్యర్థులను కలిసి శిక్షణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

===========================

===========================